క్లుప్తంగా

ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించ వద్దు



కమిషనర్‌కు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులని క్రమబద్ధీకరించి, వారికి ఉద్యోగ, వేతన భద్రత కల్పించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఏలూరు జిల్లా కార్యదర్శి భజంత్రీ శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వ్యాప్త పిలుపు మేరకు సమస్యల పరిష్కారం కోరుతూ దశల వారి ఆందోళనల్లో భాగంగా మంగళవారం స్థానిక కార్పొరేషన్ కమిషనర్ ఎ.భానుప్రతాప్‌కు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఉద్యోగ, కార్మికుల వేతనాల చెల్లింపు, పనుల నిర్వహణను ప్రైవేట్ కంపెనీ / ఏజెన్సీలకు అప్పగించే ఆలోచన విరమించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ సభ్యులు దొడ్డిగర్ల నాగబాబు, యలగాడ శివకుమార్, దుర్గారావు, మరియ దాసు, ప్రసాద్, నాగబాబు, కిషోర్, సతీష్ పాల్గొన్నారు.

బొడ్డేటిని పరామర్శించిన జేపీ



బొడ్డేటిని పరామర్శిస్తున్న జేపీ, నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఇటీవల ఆపరేషన్ చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న వైఎస్సార్ సీపీ నాయకుడు బొడ్డేటి సుబ్బారావును ఆ పార్టీ ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి మామిళ్లపల్లి జయప్రకాష్ (జేపీ) మంగళవారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు. జేపీ వెంట పార్టీ నగర అధ్యక్షుడు గుడిదేశీ శ్రీనివాస్, మాజీ డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్ బాబు, జిల్లా బీసీసెల్ అధ్యక్షుడు నెరుసు చిరంజీవులు, సీనియర్ నాయకుడు గంటా మోహన్ రావు, నగర బీసీ సెల్ అధ్యక్షుడు కిలాడి దుర్గారావు,రాష్ట్ర వాణిజ్య విభాగం సెక్రటరీ బాచి, జిల్లా గ్రీవెన్స్ విభాగ అధ్యక్షుడు స్టాలిన్, సీనియర్ నాయకుడు కొల్లిపాక సురేష్, నగర గ్రీవెన్స్ విభాగ అధ్యక్షులు ఫణి, కొండేటి చిన్ని, శంకర్, రమేష్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆంజనేయ స్వామి పూజ



ఆంజనేయ స్వామికి పూజ చేస్తున్న భక్తులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక అగ్రహారంలోని పేరయ్య కోనేరు ప్రాంగణంలో రామకోటి మహోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం విశ్వశాంతి సమాజం సభ్యుల ఆధ్వర్యంలో మౌన ధ్యానం, భక్తి గీతాలు, హరేరామ సంకీర్తనలు, స్వామి వారికి సహస్రనామ పూజలు, నిత్య హోమం , నిత కల్యాణం నిర్వహించారు. ఆంజనేయ స్వామి వారికి ఆకుపూజ, పానకంతో అభిషేకం చేశారు. పైడేటి కుసుమాంబ శిష్య బృందం ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. సాయంత్రం స్థానిక హనుమాన్ నగర్ రాధాకృష్ణ పిరమిడ్ ధ్యాన మందిరం ప్రతినిధి రాధ జోస్యుల సీతమ్మ వారి దివ్య చరితామృతవ అనే అంశంపై ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. రాత్రి నెల్లూరుకు చెందిన పరాయతం నారాయణాచార్యులు భాగవతార్ సతీ సక్కుబాయి అనే అంశంపై హరికథా కాలక్షేపం నిర్వహించారు.

ఇందిరమ్మ కాలనీ.. సమస్యల వర్రీ

- అంతర్గత రోడ్లు అధ్వానం
- అభివృద్ధికాని డ్రెయినేజీ వ్యవస్థ
- తాగునీటికి ఇక్కట్లు
- పట్టించుకోని పాలకులు
- కొత్తూరు ఇందిరమ్మ కాలనీ ఫేస్–2 వాసులకు అవస్థలు



సుద్ద నీరు అందించే బోరు వద్ద పేరుకుపోయిన చెత్త



కొత్తూరు ఇందిరమ్మకాలనీ ఫేస్-2లో పూడుకుపోయిన కచ్చా డ్రెయినేజీ

ఏలూరు రూరల్ : సుమారు 20 ఏళ్ల క్రితం ఏర్పడిన కొత్తూరు ఇందిరమ్మ కాలనీ ఫేస్–2 వెంకటాపురం పంచాయతీ పరిధిలో ఉండేది. ఈ కాలనీ నాలుగేళ్ల క్రితం ఏలూరు నగర కార్పొరేషన్‌లో విలీనమయ్యింది. ఇక్కడ పలు ప్రాంతాల్లో అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. అనేక కూడళ్లలో చెత్త పేరుకుపోయింది. పారిశుద్ధ్యం క్షీణించింది. రాత్రి వేళ వీధుల్లో లైట్లు వెలగడం లేదు. డ్రెయినేజీ వ్యవస్థ అభివృద్ధి కాకపోవడంతో ఎక్కడికక్కడ వాడకం నీరు నిలిచిపోతుంది. ఇళ్ల మధ్య నిలిచిపోయి వర్షాకాలంలో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. అయినా పాలకులు, అధికారులు స్పందించడంలేదని కాలనీ వాసులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఉప్పునీరే దిక్కు

కాలనీ ప్రజలకు సురక్షిత తాగునీరు అందడం లేదు. నగర ప్రజలు అందిస్తున్న గోదావరి నీటిని కాలనీ ప్రజలకు సైతం అందిస్తానని ప్రజాప్రతినిధులు ఎన్నికల్లో ఇచ్చిన హామీ నేటికీ అమలు కాలేదు. కొన్నేళ్లుగా అధికారులు బోర్ల ద్వారా సుద్ద నీరు సరఫరా చేస్తున్నారు. గత్యంతరం లేక ప్రతి కుటుంబం రోజుకు కనీసం రూ.20 ఖర్చు చేసి రెండు టిన్నుల నీరు కొని తాగుతున్నారు. ఇలా నెలకు రూ.600 నీటి కోసమే వెచ్చిస్తున్నారు. కాలనీలో ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మించి, దాని ద్వారా గోదావరి నీటిని సరఫరా చేయాలని ప్రజలు పాలకులను కోరుతున్నారు.

వైఎస్సార్ సీపీ హయాంలో అభివృద్ధి

పేదల నివసిస్తున్న ఈ కాలనీలో వైఎస్సార్ సీపీ హయాంలో కొంత అభివృద్ధి చేశారు. పలు అంతర్గత రోడ్లను సీసీ రోడ్లుగా నిర్మించారు. దీంతో ప్రజల ఇళ్ల ముందు రాకపోకలు సాఫీగా సాగిస్తున్నారు. ప్రధాన రోడ్డు అభివృద్ధి చేపట్టిన సమయంలో ఎన్నికలు కోడ్ అమలులోకి వచ్చింది. తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కాలనీ అభివృద్ధి పనులపై స్పందించడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

సుద్ద నీటితో అనారోగ్యం



కాలనీలో సరఫరా చేస్తున్న బోరు నీటి నుంచి సుద్ద వస్తుంది. ఈ నీరు తాగి కొందరు అనారోగ్యానికి గురవుతున్నారు. ఈ నీటితో కనీసం అన్నం వండుకోవడానికీ పనిచేయడంలేదు. స్నానం చేస్తే చర్మ వ్యాధులు వస్తున్నాయి. అంట్లు తోమడానికి, కాలకృత్యాలు తీర్చుకోడానికే ఉపయోగిస్తున్నాం. ప్రతిరోజూ ఫేస్–1లోని వాటర్ ప్లాంట్ నుంచి తాగునీరు కొంటున్నాం. రోజుకు రూ.20 ఖర్చు చేయాల్సి వస్తుంది. ఓవర్‌హెడ్ ట్యాంక్ కూడా నిర్మించలేదు. గోదావరి నీరు సరఫరా చేయాలి.

– శానాపతి అయ్యప్ప కుమారి, కాలనీ నివాసి

నిద్ర లేకుండా చేస్తున్న దోమలు



20 కుటుంబాలు పద్మశాలీలు ఉంటున్న వీధిలో రోడ్డు వర్షాకాలంలో బురదగా మారుతుంది. మురుగు నీరు, వర్షపు నీరు కిందికి పారడం లేదు. ఇంటి ముందు రోడ్డుపై రాళ్లు వేసుకుని మురుగు నీటిలో నుంచి రాకపోకలు సాగించాల్సి వస్తుంది. దోమలు పెరిగిపోతున్నాయి. చీకటి పడితే నిద్ర పోలేకపోతున్నాం. దోమ తెరలు వాడినా ఫలితం ఉండడం లేదు. అధికారులు డ్రెయినేజీ వ్యవస్థను అభివృద్ధి చేయాలి. ఇదే పరిస్థితి కొనసాగితే కాలనీలో మిగిలిన కుటుంబాలు సైతం బయటకు వెళ్లిపోతాయి.

– పొట్టేదు దుర్గ, కాలనీ నివాసి

ఫర్నిచర్ షాపులపై కేసులు



ఫర్నిచర్ షాపులో తనిఖీ చేస్తున్న అధికారులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలోని పలు ఫర్నిచర్, పరుపుల షాపుల్లో విజిలెన్స్, తూనికలు, కొలతల శాఖ అధికారులు మంగళవారం తనిఖీలు చేశారు. శ్రీ సాయి సుజాత ఎంటర్ ప్రైజస్, సుస్మిత ట్రేడర్స్ షాపుల్లో తయారీ తేదీ, తయారిదారుని చిరునామా, గరిష్ట చిల్లర ధర, వినియోగదారు సేవ ఫోన్ నెంబర్ వంటి సమాచారం లేకుండా ఉన్న, స్థానికంగా తయారు చేస్తున్న వివిధ కొలతల్లో పరుపులు, దిండ్లు వంటి వాటిని గుర్తించారు. ఈ షాపులపై మొత్తం 5 కేసులు నమోదు చేశారు. తనిఖీల్లో విజిలెన్స్ ఎస్సై కె.సీతారాము, ఏలూరు తూనికలు కొలతల అధికారి, వి.ప్రశాంత్ కుమార్ పాల్గొన్నారు.

యువత భాగస్వామ్యం అవసరం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రహదారి భద్రత అవగాహన కార్యక్రమాల్లో యువత భాగస్వామ్యం అవసరమని ఏలూరు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎస్ లక్ష్మణరావు అన్నారు. రహదారి భద్రతపై స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. ఫొటోలు, వీడియోలతో విద్యార్థులకు రహదారి ప్రమాదాలు, రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. ఐటీఐ ప్రధానాధికారి పి.రజిత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కూలీలను ప్రభుత్వమే ఆదుకోవాలి

ఏలూరు (టూటౌన్): మృతి చెందిన ఉపాధి హామీ కూలీ కుటుంబాన్ని ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని, గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కొయ్యలగూడెం మండలం కుంతలగూడెం పంచాయతీ పరిధిలో ఉపాధి పని చేస్తున్న కూలీలపై ట్రాక్టర్ దూసుకురావడంతో అక్కడికక్కడే అల్లే భాగ్యవతి అనే మహిళ మృతి చెందిందన్నారు. మరి కొందరు గాయపడినట్టు తెలిపారు. భాగ్యవతి కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని, గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని, రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ఘటనకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని, ఉపాధి హామీ పథకం పని ప్రదేశాల వద్ద ప్రాథమిక వైద్యానికి సంబంధించిన సౌకర్యాలు కల్పించాలని రవి కోరారు.

సౌకర్యాలు కల్పించాలి

ఉపాధి హామీ పని ప్రదేశాల్లో చనిపోతున్న ఉపాధి కూలీలను ప్రభుత్వమే ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ మంగళవారం ఒక పత్రిక ప్రకటనలో డిమాండ్ చేసింది. ఇప్పటికే జిల్లాలో కొయ్యలగూడెం మండలంలో ఉపాధి హామీ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ (ఎంపీడీఓ) అదనపు ప్రోగ్రామింగ్ ఆఫీసర్ (ఏపీఓ) పట్టించుకోకపోవడం వల్లే ఒక ఉపాధి కూలీ చనిపోయాడని తెలిపింది. ఏలూరు, దెందులూరు, ఉంగుటూరు మండలాల్లో కూలీలు ప్రాణాలు కోల్పోయిన సందర్భాలు ఉన్నాయని పేర్కొంది. బాధిత కుటుంబాలను ఆదుకోవాలని, రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.జీవరత్నం, పి.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మోదీ విధానాలపై ఉద్యమిద్దాం



పోస్టర్ విడదల చేసిన నాయకులు

ఏలూరు (టూటౌన్): ఈనెల 23న విజయవాడలో నిర్వహించే న్యూ డెమోక్రసీ పార్టీల విలీన సభను విజయవంతం చేయాలని కోరుతూ ఏలూరు వన్‌టౌన్ ఏరియా బడేటి చౌక వద్ద వాల్ పోస్టర్‌ను మంగళవారం విడుదల చేశారు. కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు యు.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దేశంలో మోదీ, షా ప్రజావ్యతిరేక విధానాలపై ఐక్యంగా ఉద్యమించాలన్నారు. పదేళ్ల క్రితం రెండుగా చీలిపోయిన న్యూడెమోక్రసీ పార్టీలు ఆదివారం ఉదయం విజయవాడ ఎంబీ భవన్‌లో విలీనమవుతున్నట్టు చెప్పారు. ఐఎఫ్‌టీయూ ఏలూరు నగర ప్రధాన కార్యదర్శి యర్రా శ్రీనివాసరావు, నగర సహాయ కార్యదర్శి ముంగము అప్పారావు, విజయ్, రమణ, పుణ్య మంతుల భూపతి, వలవు శ్రీనివాసరావు, గోకర్ల లక్ష్మణ్, కోరాడ అప్పారావు, సంధకం అప్పారావు, తిరుపతిరావు, గడసాయల రమణ, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవాలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక బీడీ కాలనీ చెరువుగట్టు సీతారామ నగర్ మహాగణపతి, సీతా రామచంద్ర స్వామి, కనక దుర్గమ్మ వార్ల విగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవాలు ఈ నెల 19 నుంచి 23వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యుడు ఆకుల చిన్నారావు ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 10.22 గంటలకు ఆలయంలో మూల విగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠ, అనంతరం భారీ అన్న సమారాధన ఉంటుందని తెలిపారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



డీఈఓకు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): మధ్యాహ్న భోజన పథకం కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని ఏపీ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సీఐటీయూ) నాయకులు మంగళవారం జిల్లా విద్యాశాఖ అధికారి వెంకట లక్ష్మమ్మకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం నాగమణి మాట్లాడుతూ డిసెంబర్ నుంచి మెనూ బిల్లులు, వేతనాలు లేక మధ్యాహ్న భోజన కార్మికులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, అప్పులు చేసి విద్యార్థులకు భోజనం వండి పెడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం ఈ పథకానికి బడ్జెట్ కేటాయించాలని, సకాలంలో వేతనాలు, బిల్లులు వేయాలని కోరారు. అలాగే 9, 10వ తరగతి విద్యార్థులకు వండి పెట్టే వర్కర్లకు వేతనాలు ఇవ్వాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, సంవత్సరానికి రెండు జతలు బట్టలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్ లింగరాజు, కె.విజయలక్ష్మి పాల్గొన్నారు.

అన్నేవారిగూడెం పాఠశాలలో శుభదిన్ భోజనం



అన్నేవారిగూడెంలో విద్యార్థులకు నేతి హల్వాను వడ్డిస్తున్న హెచ్‌ఎం ఎస్‌కే మస్తాన్

భీమడోలు: అన్నేవారిగూడెం యూపీ పాఠశాలలో చేపట్టిన శుభదిన్ భోజనం కార్యక్రమం మంగళవారం 50వ రోజుకు చేరింది. 122 మంది విద్యార్థులకు ఎండీఎం ఆహారానికి తోడుగా పూళ్ల గ్రామానికి చెందిన షేక్ సాజిద్ సమకూర్చిన నేతి హల్వాను వడ్డించారు. జిల్లాలో ఎక్కడా లేని విధంగా ఈ పాఠశాల విద్యార్థినీ విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో దాతల సహకారంతో మరిన్ని రుచికరమైన ఆహార పదార్థాలను అందిస్తూ శభాష్ అనిపించుకుంటున్నారు. పాఠశాల హెచ్‌ఎం ఎస్‌కే మస్తాన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల బృందం దాతల ఆర్థిక సాయంతో 50 రోజులుగా 1నుంచి 8వ తరగతి వరకు ప్రతి రోజూ ఎండీఎం భోజనంలో అదనంగా వివిధ రకాల స్వీట్లు, చికెన్ బిర్యానీ వడ్డిస్తున్నారు. వాస్తవానికి ఈ కార్యక్రమం గతేడాది జూలై 27న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో ఆ రోజు మాత్రమే దాతల ఆర్థిక సాయంతో విద్యార్థులకు విందు భోజనాలు వడ్డించారు. అన్నేవారిగూడెం పాఠశాలలోని హెచ్‌ఎం ఎస్‌కే మస్తాన్ గ్రామం, మండల, జిల్లా, ఇతర ప్రాంతాల్లోని స్నేహితులు, పరిచయస్తుల సహకారంతో విద్యార్థులకు రుచికరమైన స్వీట్లు, బిర్యానీ అందించేందుకు కృషి చేస్తున్నారు. దీనితో విద్యార్థులకు 50 రోజులుగా మధ్యాహ్న భోజనంలో వివిధ ఆహార పదార్థాలను వడ్డిస్తున్నారు.ఈ కార్యక్రమంలో టీచర్లు స్వర్ణలత, విజయకుమారి, జ్యోతిబస్, దుర్గాప్రసాదిని, ఝాన్సీ, రవిభారతి, శారారాణి తదితరులు ఉన్నారు.

ప్రతి పౌరుడూ చట్టానికి లోబడి జీవించాలి



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న రత్నప్రసాద్

పెదవేగి : ప్రతి పౌరుడు చట్టానికి లోబడి నడుచుకోవాలని, ప్రజలకు చట్టాలపై అవగాహన పెంపొందించడమే జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ముఖ్య ఉద్దేశమని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె రత్నప్రసాద్ అన్నారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశాల ప్రకారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి (యఫ్.ఎ.సి) ఎం సునీల్ కుమార్ ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. రత్నప్రసాద్ దుగ్గిరాలలోని సెయింట్ విన్సెంట్ డిపాల్ డిగ్రీ కాలేజీలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. డ్రైవింగ్ లైసెన్స్, వాహన నమోదు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. రత్నప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు రోడ్డు నిబంధనలను పాటించాలని సూచించారు. రవాణా శాఖ అధికారి కె కృష్ణారావు మాట్లాడుతూ వాహనాన్ని నడిపే ప్రతి వ్యక్తి డ్రైవింగ్ లైసెన్స్, వాహనానికి సంబంధించిన పత్రాలు కలిగి ఉండాలన్నారు. 18 ఏళ్లు నిండిన వారు డ్రైవింగ్ లైసెన్స్ పొందటానికి అర్హులని తెలిపారు. ఏలూరు మూడవ పట్టణ సబ్ ఇన్‌స్పెక్టర్ పి.రాంబాబు, ప్యానల్ లాయర్ కూనా కృష్ణారావు మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తూ మొబైల్ ఫోన్లో మాట్లాడుతున్నారని, ఇది ప్రమాదాలకు ఒక ముఖ్య కారణమవుతోందని తెలిపారు. వాహనచోదకులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. సెయింట్ విన్సెంట్ డిపోల్ కాలేజ్ ప్రిన్సిపల్ రోబిన్, విద్యార్థులు పాల్గొన్నారు.

దివ్యాంగుల విభాగ అధ్యక్షుడికి సత్కారం



కిరణ్ రాజ్‌ను సత్కరిస్తున్న జయప్రకాష్

ఏలూరు (టూటౌన్): వైఎస్సార్ సీపీ రాష్ట్ర దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు బంధిల కిరణ్ రాజ్ మంగళవారం ఆ పార్టీ ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి మామిళ్లపల్లి జయప్రకాష్ (జేపీ)ని ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కిరణ్‌రాజ్‌ను జేపీ దుశ్శాలువాతో సత్కరించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్ బాబు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు నెరుసు చిరంజీవి, జిల్లా దివ్యాంగుల విభాగ అధ్యక్షుడు షామిమ్, నగర బీసీ సెల్ అధ్యక్షుడు కిలాడి దుర్గారావు, నగర దివ్యాంగుల విభాగ అధ్యక్షుడు నాగేశ్వరరావు, గ్రీవెన్స్ విభాగ అధ్యక్షుడు మద్దాల ఫణి, సీనియర్ నాయకులు సైదు కొండా, బండ్లమూడి సునీల్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ప్రత్యేక సేవలు



పోస్టర్‌ను విడుదల చేస్తున్న సూపరింటెండెంట్ సుందర్‌బాబు

దెందులూరు: దివ్యాంగులకు ప్రత్యేక సేవలు అందిస్తున్నట్టు ఉమా ఎడ్యుకేషన్ అండ్ టెక్నికల్ సొసైటీ సభ్యులు తెలిపారు. ఏలూరు దొండపాడులోని ఉమా ఎడ్యుకేషన్ అండ్ టెక్నికల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం మంగళవారం అంతర్జాతీయ ఆస్పెర్జర్స్ డే సందర్భంగా అవగాహన సదస్సును దెందులూరు సీహెచ్‌సీలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ బంక సుందర్‌బాబు మాట్లాడుతూ ఆస్పెర్జర్స్ డే సిండ్రోమ్ అనేది ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్‌కు ఒక రూపం అన్నారు. ఈ వైకల్యం కలిగిన వారు హాస్యం, వ్యంగ్యం, శారీరక అభినయాలను అర్థం చేసుకోలేరని తెలిపారు. సంస్థ కోఆర్డినేటర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ జిల్లా దివ్యాంగుల పునరావాసన కేంద్రం ద్వారా దివ్యాంగులకు అవసరమైన ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ, ఆడియోలజీ, కృత్రిమ అవయవాలు సేవలు అందిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో పునరావాస కేంద్ర సిబ్బంది, వైద్య సిబ్బంది ఉన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	30
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	39
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్	22.30	19
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	14
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	27
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	20
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	25
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	30
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	27
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	29
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	23
ఏలూరు - తిరుపతి	16.00	4830	34

అప్రోచ్ రోడ్డులో గోతుల పూడ్చివేత



గ్రావెల్‌తో గోతులు పూడ్చుతున్న అధికారులు

సాక్షి స్పందన

నిడమర్రు: బావాయిపాలెం–గణపవరం మలుపులో కుంగిన అప్రోచ్ రోడ్డు మార్జిన్‌పై ఈనెల 17న సాక్షిలో కుంగిన అప్రోచ్ రోడ్డు.. ప్రయాణానికి ఇక్కట్లు శీర్షికతో వెలువడిన కథనానికి అధికారులు స్పందించారు. మంగళవారం రోడ్డు మార్జిన్ గోతుల్లో గ్రావెల్‌తో పూడ్చారు. ఆర్‌అండ్‌బీ నిడమర్రు ఇన్‌చార్జ్ ఏఈ భాస్కర్‌రావు మాట్లాడుతూ ప్రయాణీకులకు, వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా ప్రస్తుతానికి మెటల్ గ్రావెల్‌తో పూడ్చుతున్నామని, త్వరలో ర్యాంపు నిర్మిస్తామని తెలిపారు.

గుండె పోటుతో కూలీ మృతి

ఏలూరు (టూటౌన్): వలస కూలీ గుండెపోటుతో మృతి చెందిన ఘటన ఏలూరు నగరంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. స్థానిక జన్మభూమి పార్క్ వెనుక ఉన్న తమ్మిలేరు కాలువలో ఉన్న గుర్రపు డెక్కను కొందరు కూలీలు తొలగిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం ఉండ్రాజువరం మండలం వడ్డూరు గ్రామానికి చెందిన ఎం సూర్యారావు (60) ఒక్కసారిగా గుండెపోటుతో కుప్పకూలాడు. తోటి కూలీలు సూర్యారావు బంధువులకు సమాచారం ఇచ్చారు. దీనిపై ఏలూరు త్రీటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. వడ్డూరు నుంచి సూర్యారావు నాలుగు రోజుల నుంచి నిత్యం ఏలూరు వచ్చి పని ముగించుకుని వెళుతున్నట్టు తోటి కూలీలు తెలిపారు.

అగ్ని అస్త్రంతో పురుగుల నివారణ

పెదవేగి : ప్రకృతి వ్యవసాయంలో అగ్ని అస్త్రం ఎంతగానో ఉపకరిస్తుందని ప్రకృతి వ్యవసాయ కొప్పాక యూనిట్ ఇన్‌చార్జ్ చందు సత్తిబాబు అన్నారు. పెదవేగి మండలం కొప్పాక యూనిట్‌లో ఆయన సామూహికంగా మంగళవారం 200 లీటర్ల అగ్ని అస్త్రం తయారు చేశారు. ఈ సందర్భంగా సత్తిబాబు మాట్లాడుతూ అగ్ని అస్త్రం వల్ల పంటలకు కలిగే ఉపయోగాలను వివరించారు. మొక్కజొన్నలో కత్తెర పురుగుకు నివారణకు, వరి పంటలో కాండం తొలుచు పురుగు, వివిధ పంటల్లో కనిపించే లద్దె పురుగులను అరికట్టేందుకు అగ్ని అస్త్రం ఉపయోగపడుతుందన్నారు. ఎకరానికి 5 లీటర్ల అగ్ని అస్త్రం ద్రావణాన్ని 100 లీటర్ల నీళ్లు తీసుకుని పిచికారీ చేయాలన్నారు. అనంతరం అగ్ని అస్త్రం తయరీకి కావాల్సిన పదార్థాలను వివరించారు. ఐసీఆర్‌పీలు డీ దుర్గ, బి ప్రియాంక, డీ త్రిలోక్, ఆర్ ఫణి కొంత మంది రైతులు పాల్గొన్నారు.